తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాదాద్రి భువనగిరి
శుక్రవారం 26 ఏప్రిల్ 2024 | పేజీలు : 08



## వాకర్స్ ను కలిసిన నామ నాగేశ్వరరావు

### నామకు కృతజ్ఞతలు తెలిపిన వాకర్స్

ఖమ్మం టౌన్,ఏప్రిల్25(జనంసాక్షి)
బీఆర్ ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు గురువారం ఉదయం ఖమ్మం లోని పెవిలియన్ గ్రౌండ్ లో వాకర్స్ ను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ నుంచి మంచి స్పందన లభించింది. గ్రౌండ్ లో వాకర్స్ కోసం వాకింగ్ ట్రాక్, మంచినీటి పైపు లైన్, పంపు ఏర్పాటు తో పాటు షటిల్ కోర్టు లో వసతులు కల్పించి న నాయకుడు నామ అని వాకర్స్ తెలిపారు.గ్రౌండ్ ను అభివృద్ధి చేసిన నామకు వాకర్స్ క్లబ్ తరపున అధ్యక్షుడు , కార్పొరేటర్ ఆయిన బుడిగం శ్రీనివాస్ అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.నామ ఇచ్చిన లక్షలాది రూపాయల నిధులతోనే గ్రౌండ్ లో వాకింగ్ ట్రాక్, వాటర్ పైపు లైన్,పంపు, షటిల్ కోర్టు తదితర పనులు చేపట్టినట్లు తెలిపారు. తప్పని సరిగా ఈ సారి కూడా నామకే ఓటు వేసి గెలిపిస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధి ప్రదాతకే తమ ఓటు అని చెప్పారు. ఈ సందర్భంగా గ్రౌండ్ లో వాకింగ్ చేస్తున్న ప్రతి ఒక్కరిని నామ కలిసి ఈ ఎన్నికల్లో తనకే కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.మంచి మెజార్టీతో గెలిపిస్తే అన్ని విధాలా అండగా ఉండి మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. తెలంగాణా ప్రయోజనాలు కాపాడాలంటే తప్పనిసరిగా బీఆర్ ఎస్ ఎంపీలు గెలవాలన్నారు. పార్లమెంట్ సాక్షిగా ఎన్నో సమస్యలపై గొంతు విప్పి, పోరాడానని చెప్పారు. ప్రతి ఒక్కరూ తన గెలుపునకు కృషి చేసి పార్లమెంట్ కు పంపిస్తే జిల్లాను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లాలో రూ 8 వేల కోట్ల విలువైన జాతీయ రహదారులను తీసుకొచ్చానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బుడిగం శ్రీను, కార్యదర్శి వెంకట్, 49వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పార్థసారధి, డివిజన్ పార్టీ ప్రెసిడెంట్ మన్యం వెంకట రమణ, భాస్కర రావు, ఉయ్యురు కోటయ్య, జక్కుల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



## అత్యంత ఎత్తైన ప్రదేశానికి దేవరకొండ వాసి అజీజ్

*సోషల్ మీడియాలో పలువురి ప్రశంసలు పొందుతున్న అజీజ్*

**దేవరకొండ జనం సాక్షి ఏప్రిల్ 25**

నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణానికి చెందిన అజీజ్ అత్యంత ఎత్తైన 11649 ఫీట్లు ఎత్తులో గల జోజిలా పాస్ కు చేరుకున్నాడు.ఇది భారతదేశంలోనే పొడవైన రోడ్డు టన్నెల్, అంతేకాకుండ పొడవైన బై డైరెక్షన్ టర్నల్.ఇక్కడ ఉష్ణోగ్రత చాలా తక్కువగా ఉంటుంది ఈ ప్రదేశాన్ని జీరో పాయింట్ అని కూడా పిలుస్తారు. దేవరకొండ నుంచి బైక్ పై కేవలం 6 రోజుల్లో అక్కడికి వెళ్లిన అజీజ్ పర్వతాన్ని అధిరోహించాడు. అంతేకాకుండా జోజిలా టన్నెల్ సోనామార్గ్, **మిగతా 2లో..**



### ప్రజలు వడదెబ్బకు గురికాకుండా

## తగు జాగ్రత్తలు తీసుకోవాలి

### కలెక్టర్ హరిశ్చందన

నల్గొండ బ్యూరో, ఏప్రిల్ 25,(జనం సాక్షి) :
వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలు రికార్డు అవుతున్న నేపథ్యంలో, ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ముంద స్తు తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన కోరారు.వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై జిల్లా ప్రజలలో అవగాహన కల్పించేందుకుగాను,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండలరావు స్వయంగా రచించి, రూపొందించి,గానం చేసిన ఆడియో పాటల సిడిని ఆమె గురువారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆవిష్కరించారు. ఆడియో సిడి ఆవిష్కరణ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ఉష్ణోగ్రతలు ఎక్కువగా

### కోదాడ పట్టణ శివార్లలో

## ఘోర రోడ్డు ప్రమాదం..



**లారీని ఢీ కొట్టిన ఇన్నోవా ఎర్టికా కారు ప్రమాదంలో ఆరుగురు స్పాట్ డెడ్ : మరో నలుగురికి గాయాలు**



**కోదాడ టౌన్ ఏప్రిల్ 25 ( జనంసాక్షి ):** కోదాడ పట్టణ శివార్లలోని శ్రీరంగాపురం వద్ద గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోదాడ మండలం చిమిర్యాల చెందిన శ్రీకాంత్ గత పది ఏళ్లుగా హైదరాబాదులో కార్ డ్రైవర్ గా పని చేస్తూ జీవనం గడుపుతున్నాడు.అతనికి భార్య నాగమణి ఇద్దరు పిల్లలు లాస్య, లావణ్య ఉన్నారు.కాగా లాస్య కు విజయవాడ గుణదలలో చెవులు కుట్టించే వేడుకకు హైదరాబాద్ నుండి శ్రీకాంత్ కుటుంబంతో పాటు బంధువులు మాణిక్యమ్మ ,చందర్రావు కృష్ణంరాజు స్వర్ణ పిల్లలు కౌశిక్, కార్తీక్ బయలుదేరారు.మొత్తం పదిమంది కారులో విజయవాడకు వెళుతుండగా కోదాడ పట్టణ శివారులోని శ్రీరంగాపురం వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీ కొట్టింది ఈ ఘటనలో శ్రీకాంత్ అతని కుమార్తె లాస్య బంధువులు మాణిక్యమ్మ చందర్రావు కృష్ణంరాజు స్వర్ణ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు శ్రీకాంత్ భార్య నాగమణి అతని కుమార్తె లావణ్య తోపాటు బంధువుల పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. కాగా గాయపడ్డ వారిని మృతులను పోలీసులు కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రులకు తక్షణ చికిత్స అందిస్తున్నారు.

# ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి : కలెక్టర్ హరిశ్చందన

ఉన్నాయని,వేడి గాలులు సైతం వీస్తున్నాయని,దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు.నీరసంగా అనిపించడం, ఒళ్లంతా వేడి కావడం,తలనొప్పి, వాంతులు, విరేచనాల వంటి లక్షణాలు కనబడితే తక్షణమే చక్కర,ఉప్పు ద్రావణాన్ని తాగాలని, ఆ వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి డాక్టర్ కు చూయించుకోవాలని తెలిపారు.అంతేకాక ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలని, అత్యవసరమై బయటకు వెళ్ళవలసి వస్తే వదులు దుస్తులు, లేత,పల్చటి దుస్తులు ధరించాలని, నిలువ ఉంచిన ఆహారం తినకూడదని, మాంసాహారం తినకుండా చూసుకోవాలని, ద్రవపదార్థాలు,పండ్లు వంటివి ఎక్కువగా తీసుకోవాలని ఆమె తెలిపారు.జిల్లా కేంద్రం మొదలుకొని గ్రామస్థాయి వరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,సబ్ సెంటర్లలో ఓ ఆర్ ఎస్ పాకెట్లను సిద్ధంగా ఉంచడం జరిగిందని,ఏఎన్ఎం, ఆశాల వద్ద సైతం ఓ ఆర్ ఎస్ పాకెట్లు ఉన్నాయని ,జిల్లాలో 5 లక్షల ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అంతేకాక వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమాచారాన్ని సైతం సిద్ధంగా ఉంచామని తెలిపారు. మే 13న లోక సభ ఎన్నికల పోలింగ్ జరుగుతున్న దృష్ట్యా ఓటర్లు వడదెబ్బకు గురికాకుండా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీటితో పాటు,ఓ ఆర్ఎస్ పాకెట్లను సైతం ఏర్పాటు చేయడం జరిగిందని, నీడ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.ప్రజలు ముందు జాగ్రత్త గా వడదెబ్బ నుండి కాపాడుకునేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండలరావు తానే స్వయంగా రచించి, గానం చేసి ప్రజలలో చైతన్యం నింపడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండలరావు,సమాచార శాఖ సహాయ సంచాలకులు యు,వెంకటేశ్వర్లు,కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఫీల్ పబ్లిసిటీ ఆఫీసర్ కోటేశ్వరరావు,ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఘన శ్యామ్, వైస్ ప్రిన్సిపల్ తదితరులు ఉన్నారు.



# అత్యంత ఎత్తైన ప్రదేశానికి దేవరకొండ వాసి అజీజ్

***సోషల్ మీడియాలో పలువురి ప్రశంసలు పొందుతున్న అజీజ్***

కార్గిల్ మధ్యన ఉన్న జోజిలా ఘాట్స్‌లో సముద్రమట్టానికి 14.2 కిలోమీటర్ల మేర శ్రీనగర్ – లేహ్‌లను కలుపుతూ 9.5 మీటర్ల వెడల్పు, 7.57 మీటర్ల ఎత్తుతో రెండు వరుసల్లో నిర్మిస్తున్న టన్నెల్ కావడం విశేషం.హిమాలయాల్లో భారత కేంద్ర పాలిత ప్రాంతమైన లడఖ్ లో ఉన్న ఎత్తైన పర్వత శిఖరం కి చేరిన అజీజ్ కు సోషల్ మీడియాలో పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.



# మత సామరస్యానికి ప్రతీక ఈద్ మిలాప్

## జేఐహెచ్ కేంద్ర కమిటీ సభ్యురాలు ఆయేషా సుల్తానా

ఖమ్మం బ్యూరో , ఏప్రిల్25(జనంసాక్షి)

నేటి సంక్లిష్ట రాజకీయ సామాజిక ఆరాచక పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు మధ్య మత విద్వేషానికి లోను కాకుండా అందరూ సోదర భావంతో కలిసిమెలసి మెలుగాలని , ఉన్నత ఆశయంతో నిర్వహించే ఈద్ మిలాప్ మతసామరస్యానికి ఒక ప్రతీక వంటిదని జమాతే ఇస్లామి హింద్ సభ్యురాలు , ఆవేర్ మెంబర్ , రేడియన్స్ అసిస్టెంట్ ఎడిటర్ ఆయేషా సుల్తానా అన్నారు. జమాతే ఇస్లామీ హింద్ ( రుద్రంపూర్ ) విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈద్ మి లా ప్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా అన్యాయాలు, అక్రమాలు , అవినీతి , ఆరాచకతత్వం, అమానుషకృత్యాలు , భౌతిక దాడులు సర్వసాధారణ అంశంగా పరిస్థితులు దిగజారిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఓటు బ్యాంకు కోసం పార్టీలు , పాలకులు, హిందూ బి ముస్లిం అంటూ మత దురభిమానాన్ని పెంచి , పోషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలలో అందరూ అమూల్యమైన



తమ ఓటు వేసి , ప్రజాస్వామ్యం కల్పించిన హక్కును సద్వినియోగ పరుచుకోవాలని హితవు పలికారు. తమ స్వలాభం కోసం జాతి హితాన్ని బలిపెట్టే స్వార్థ రాజకీయ నాయకులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. దేశ ఔన్నత్యాన్ని , దేశ లౌకికవాదాన్ని , భిన్నత్వంలో ఏకత్వం సూత్రాన్ని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫార్మసిస్ట్( సింగరేణి ) అర్చన , జమాతే ఇస్లామి హింద్ రుద్రంపూర్ బాధ్యులు ఫాతిమా నక్షత్ర సమయం తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కులాలన్నీ ఏకమై కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలి

## యాదవుల ఆత్మీయ సమావేశంలో నామ నాగేశ్వరరావు

ఖమ్మం అర్బన్, ఏప్రిల్25(జనంసాక్షి)

కేసీఆర్ ఆశీర్వదించి,బీఫామ్ ఇచ్చి మీ వద్దకు పంపారు.. బీసీలంతా సమైఖ్య%శీ%గా కలసి మెలసి పని చేసి తనను గెలిపించి మళ్లీ పార్లమెంట్ కు పంపాలని బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలో గురువారం జరిగిన యాదవుల ఆత్మీయ సమావేశంలో నామ మాట్లాడారు.యాదవులతో తనకు అవినాభవ సంబంధం ఉందని, యాదవులు మాట ఇస్తే వెనక్కిపోరని అన్నారు.వారికి మంత్రి పదవి ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వానికి అన్ని కులాలు కలిసి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తన కన్న బిడ్డల కంటే మిన్నగా దివంగత చిత్తారు శ్రీహరి యాదవ్ కోరిక మేరకు ఆయన కుమార్తె ను లక్షల డోనేషన్ కట్టి ఎంబీబీఎస్ చదివించానని చెప్పారు. గత ఎన్నికల్లో కూడా యాదవులు తనకు మద్దతుగా నిలిచారని , ఈ ఎన్నికల్లో కూడా తనకు మద్దతుగా నిలిచి, తనను మంచి మెజార్టీతో గెలిపించాలని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ బీసీ బిడ్డ కూరాకుల నాగభూషణం ను కుట్రతో పదవి నుంచి దించిన కాంగ్రెస్ కు యాదవులు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కలిసి కడుపు మంటతో ఈ పని చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు సాదించగల సత్తా , ధైర్యం ఉన్న నామకు ఆశీస్సులు అందజేయాలని అన్నారు.రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ గడి దొరకు , రైతు బిడ్డ నామకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో బీసీలంతా ఐక్యంగా నామకు మద్దతుగా నిలవాలన్నారు. ఓటేసినందుకు కాంగ్రెస్ బీసీలపై కక్ష గట్టిందని, కుట్ర చేసి, బీసీ బిడ్డ కూరాకుల నాగభూషణం ను పదవి నుంచి తొలగించారని తెలిపారు. కేసీఆర్ 10 ఏళ్ల అద్భుత పాలనలో 86 బీసీ కులాలకు హైదరాబాద్ లో విలువైన స్థలాలు ఇచ్చిన సంగతిని గుర్తు చేశారు.ఈ సందర్భంగా కూరాకుల నాగభూషణం ను, నామను, వద్దిరాజు రవిచంద్ర ను శాలువా తో సన్మానించారు.యాదవ్ సంఘం నాయకులు చిత్తా రు సింహాద్రి యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చిలకల వెంకటనర్సయ్య యాదవ్, మేకలసుగుణారావు,కూరాకుల వలరాజు,



మీగడ శ్రీనివాసరావు, తుమ్మ రాంబాబు, కోడి లింగయ్య, చిత్తారు ఇందుమతి, చింతలచెర్వు లక్ష్మీ, పద్మ, విజయలక్ష్మి, అమరబోయిన లింగయ్య, మొర్రిమేకల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

### అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా వెలిసిన

# ఇటుక బట్టీలు

**-పట్టించుకోని రెవెన్యూ ఫారెస్ట్ మైనింగ్ విద్యుత్ శాఖల అధికారులు - దర్జాగా విద్యుత్ చౌర్యం**







లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 25(జనంసాక్షి): మండలంలోని అనిశెట్టిపల్లి జూబ్లీపురం కారుకొండ గ్రామాలలోఅక్రమాల పుట్టగా ఇటుక బట్టీలు తయారౌతున్నాయి.ఇటుక బట్టీ ఏర్పాటు చేయాలంటే ముందుగా గ్రామ పంచాయితీతో పాటు మైనింగ్, రెవెన్యూ, పరిశ్రమశాఖ, కార్మికశాఖ, విద్యుత్ శాఖ, నుండి అనుమతి తీసుకొని బట్టీలు ఏర్పాటు చేసుకోవాలి. లక్ష్మిదేవిపల్లి మండలంలో అవి ఏవి కనిపించడంలేదు. అంబ సత్రం భూముల్లో ఏర్పాటు చేయడమే కాకుండా స్థానికంగా ఉండే వనరులన్ని కొల్లగొడుతున్నారు. స్థానికంగా ఉండే అటవీ ప్రాంతం నుంచి ఇటుక బట్టీలు కాల్చడానికి కలప తీసుకు వస్తున్నా కానీ ఫారెస్ట్ అధికారులు ఎవరూ కూడా అటువైపు చూడటం లేదు.ఏళ్ళ తరబడి వ్యాపారాలు కొనసాగుతున్న అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. జనావాసాలకు 5కిలో మిటర్ల దూరంలో ఇటుక బట్టీలు ఏర్పాటు చేసుకోవాలి.అలాగే వ్యవసాయ భూమికి నాలా అనుమతి తీసుకున్న తర్వాతే పనులు ప్రారంబించాలి. వీటిలో ఏ ఒక్కటి అనుమతి లేకున్నా సదరు నిర్వాహకునిపై చర్యలు తీసుకొని బట్టీలను సీజ్ చేసే అధికారం రెవెన్యూ అధికారులకు ఉన్నా ఒక్కరిపైన కూడా చర్యలు చేపట్టలేదు. ఒరిస్సా ఛత్తీస్గడ్ రాష్ట్రాల నుంచి ఇటుక బట్టీల తయారీకి కార్మికులను తీసుకువచ్చి ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా వారితో గొడ్డు చాకిరి చేయిస్తున్నారు బాల కార్మికులు సైతం పనిచేస్తున్న పట్టించుకునే నాధుడే లేడు.గ్రామ స్థాయిలో బహిరంగంగా వ్యాపారాలు కొనసాగిస్తున్న అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరి స్తున్నారని విమర్శలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసా యానికి ఉచితంగా ఇచ్చే 24గంటల విద్యుత్ సరఫరా చేస్తుంటే ఇటుక బట్టీల వ్యాపారం నిర్వహించే వారు మాత్రం ఉచిత విద్యుత్‌ను తమ వ్యాపారాలకు వాడుకుంటున్నారు. కొంతమంది పోల్స్ మీద వైర్లు వేస్తూ దొంగతనంగా విద్యుత్ను వాడుకుంటున్నారు. పంట భూములల్లో ఉన్న బోరులను సైతం వ్యాపారా నికి అనుగుణంగా వాడుకుంటున్నారు. పరిసర ప్రాంతాలలోని కుంటల్లో, చెరువుల్లో అక్రమంగా మట్టిని తరలించి ఇటుకల తయారీకి ఉపయోగిస్తున్నారు. అనిశెట్టిపల్లి, జూబ్లీ పురం లోని చెరువు నుంచి వందలాది ట్రిప్పుల మట్టిని అర్ధరాత్రి అక్రమంగా జెసిబి లతో తొవ్వి ట్రాక్టర్లలో లోడ్ చేసి అక్రమంగా తరలిస్తున్నారు అయినా ఇరిగేషన్ అధికారులు ఎవరూ కూడా పట్టించుకోకపోవడం గమనార్హం.ఈ మట్టినంత ఇటుకల తయారీకి ఉపయోగిస్తున్నారు. అయినా కానీ అధికారులు ఎవరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఫారెస్ట్ లో నుంచి అక్రమంగా కలపను సేకరించి ఇటుకల బట్టీలు కాల్చడానికి ఉపయోగిస్తున్నారు ఫారెస్ట్ అధికారులు ఎవరూ కూడా అటువైపు చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది ఇంత జరుగుతున్నా కానీ అధికారులు ఎవరూ ఎందుకు పట్టించుకోవడంలేదని మండలంలోని ప్రజలు చర్చించుకుంటున్నారు ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి ఈ అక్రమ ఇటుక బట్టి యజమానులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.



## వేసవి దృష్ట్యా కూలీలు జాగ్రత్తలు పాటించాలి..

**- ఏపీవో విజయలక్ష్మి..**

బూర్గంపహాడ్ ఏప్రిల్ 25 (జనంసాక్షి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం ఈజీఎస్ ఏపీవో విజయలక్ష్మి వేసవికాలం దృష్ట్యా ఉపాధిహామీ పనులకు వచ్చే కూలీలకు వడదెబ్బ తగలకుండా పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గురువారం మండల పరిధి సోంపల్లిలో జిర్రకుంట చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ కూలీలు చేస్తున్న పనికి ప్రభుత్వం రోజు కూలీ 272 ఇస్తుండగా ప్రస్తుతం ఆ మొత్తాన్ని రూ.300లకు పెంచడం జరిగిందని, కూలీలు తమకు అప్పగించిన కొలతల ప్రకారం పనులు పూర్తిచేయాలని, ఎండతీవ్రతను దృష్టిలో ఉంచుకుని పనులు చేయాలని, కూలీలకు మంచినీటి వసతితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట టెక్నికల్ అసిస్టెంట్ స్వాతి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ లింగ, కూలీలు పాల్గొన్నారు.




## మలేరియా పై అవగాహన, ర్యాలీ నిర్వహించిన పీహెచ్సీ సిబ్బంది.

బూర్గంపహాడ్ ఏప్రిల్ 25 (జనంసాక్షి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల పరిధి మోరంపల్లి బంజర్ పీహెచ్సీ ఆధ్వర్యంలో డా. లక్ష్మిసాహితీ ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం వారి సిబ్బందితో కలిసి మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత సమావేశం ఏర్పాటు చేసి మలేరియా పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మలేరియా నిర్మూలనకు వైద్యసిబ్బంది ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. ఫ్రైడే డ్రైడే, శానిటేషన్, యాంటీ లార్వాలకు సంబంధించి వర్షాకాలంలో గ్రూప్ మీటింగ్లు, దోమతెరలవాడకం, పంచాయతీల సహకారంతో వీహెచ్ఎస్ఎన్సీ సమావేశాల ఏర్పాటు, వలస కూలీలను గుర్తించడం, జ్వరబాధితులను గుర్తించి రక్తపూతల సేకరణ, నివారణ నిర్మూలన గురించి సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ యూ ఓ. బి జీతు, సీహెచ్ఒ. బి సోమ్లా, సీ హెచ్ ఓ నాగమణి, హెచ్ ఈ ఒ రవి, హెచ్ఎస్ రమణమూర్తి, హెచ్ వి లు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకూడదు

**నేర విచారణలో జాప్యం వహిస్తే సహించేది లేదు**

**ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేసి భాదితులకు న్యాయం చేకూర్చాలి**

**నెలవారీ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్**



కొత్తగూడెం,ఏప్రిల్ 25 (జనం సాక్షి ): జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాబోయే పార్ల మెంట్ ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా పోలీస్ అధికారులు ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారు లంతా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలకు పోలింగ్ రోజున సమయాన్ని తెలియజేస్తూ ఓటు వేసే విధంగా అవగాహన కల్పించి ఓటింగ్ శాతాన్ని పెంచే విధంగా కృషి చేయాలని తెలిపారు.విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని అన్నారు.దొంగతనం కేసుల్లో చోరీ సొత్తును రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు.గంజాయి లాంటి మత్తు పదార్థాలను రవాణా చేసే వారితో పాటు సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహారించాలని తెలిపారు. మట్కా,జూదం, బెట్టింగు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కేసుల నమోదు చేయాలని తెలిపారు.సైబర్ క్రైమ్స్ బారిన పడకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.రౌడీషీటర్లు మరియు పాత నేరస్తుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేసుకుని వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు.సాధారణ ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తుల పట్ల కఠినమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్,డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి,కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,మణుగూరు డిఎస్పీ రవిందర్ రెడ్డి,ఇల్లందు డిఎస్పీ చంద్ర భాను, ట్రైనీ ఐపిఎస్ విక్రాంత్ సింగ్ మరియు సీఐలు,ఎస్సైలు,సిబ్బంది పాల్గొన్నారు.



# బి టి పి ఎస్ లో ఘనంగా ఈద్ మిలాప్



మణుగూరు, ఏప్రిల్ 24 (జనంసాక్షి): కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి జీవించినప్పుడే సమాజం లో శాంతి సామరస్యాలు వెల్లివిరుస్తాయని బి టి పి ఎస్ చీఫ్ ఇంజనీర్ బి బిచ్చన్న అన్నారు. బుధవారం అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ లో ముస్లిం సోదరులు నిర్వహించిన ఈద్ మిలాప్ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా పాల్గొని మాట్లాడారు... బి టి పి యస్ కర్మాగారం నందు కార్మికులందరూ అంకిత భావం తో ఒకరికి ఒకరు సహకారం అందించుకుంటూ కార్యక్రమాలు చేయడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. జనాబ్ అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ... అందరికీ సృష్టికర్త అయిన దేవుడు ఒక్కడే అని, భిన్న మతాలు విభిన్న సంస్కృతులకు నిలయం అయిన భారత దేశం లో ఒకరి పండుగలు మరొకరు గౌరవించుకుంటూ అందరు కలిసి చేసుకోవడం శాంతి దాయకం అని అన్నారు. పర్యవేక్షక ఇంజినీర్లు, డీ వై ఎ సీ ఏ , విజిలెన్సు డీఎస్పీ పాల్గొని తమ అమూల్యమైన సందేశం ఇచ్చారు. అన్ని మతాలు ఒకటే పండుగలు ఉత్సవాలు మన సంస్కృతి సాంప్రదాయాలు గుర్తు చేస్తుంది. కుల మతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి పండుగలు జరుపుకునే ఆచారం ఒక్క భారతదేశం లోనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మోహతరమా అల్తాఫ్ ఉన్నీసా, జైబున్నీసా బేగం, అక్తర్ హుస్సేన్, సాదిక్ పాషా, ఆరిఫ్ అహ్మద్, సభా తస్నీమ్, కీమత్, షంషుద్దీన్, సాజిద్, రాయ్ సాహెబ్, రియాజ్, రహీమ్, తాజుద్దీన్, రెహమతుల్లా, ఇబ్రహీం ముస్లిం సోదర సోదరీమణులు బి టి పి యస్ కార్మికులు అందరి సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కూరాకుల సన్మానసభలో ఎంపీ వద్దిరాజు సందేశం



ఖమ్మం ఆర్సి,ఏప్రిల్25 (జనంసాక్షి) రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర లోకసభలో బీఆర్ఎస్ పక్ష నేత, పార్టీ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి డీసీసీబీ మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం సన్మానసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు .యాదవ సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం బైపాస్ రోడ్డులోని సప్తపది ఫంక్షన్ హాలులో గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ కార్యక్రమంలో నాగభూషణం బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారుఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, ప్రధాని మోదీ తాను బీసీనని చెప్పుకుంటూనే బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం చేస్తున్నరు ఆయన పదేళ్ల నుంచి అత్యున్నత పదవిలో ఉన్నా కూడా కేంద్రంలో బీసీ ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయలేదు మహానేత కేసీఆర్ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని మోడీ పదేళ్లుగా తొక్కి పెట్టారు కులగణన చేపట్టాలని అన్ని వర్గాల ప్రజల నుంచి డిమాండ్ పెద్ద ఎత్తున వినిపిస్తున్నా మోడీ పట్టించుకోవడం లేదు కులగణన,బీసీ,మహిళా రిజర్వేషన్స్ అమలు జరగాలంటే బీఆర్ఎస్ ఎంపీలను గెలిపించుకోవాలనినామ నాగేశ్వరరావు వంటి బలమైన నాయకుడు పార్లమెంటులో ఉంటేనే ప్రజల న్యాయమైన హక్కులకు పరిష్కారం దొరుకుతుంది ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీలు బీఆర్ఎస్ కు సంపూర్ణ మద్దతునిద్దాం నామను భారీ ఓట్ల మెజారిటీతో గెలిపించేందుకు మనమందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాంఈ కార్యక్రమంలో "జై తెలంగాణ జైజై తెలంగాణ","జై యాదవ జైజై యాదవ","బీఆర్ఎస్ లోకసభ అభ్యర్థి నామ నాగేశ్వరరావు కారు గుర్తుకే మన ఓటు","గెలిపిద్దాం గెలిపిద్దాం నామ నాగేశ్వరరావును భారీ ఓట్ల మెజారిటీతో గెలిపిద్దాం"అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారుఈ సందర్భంగా రాజ్యసభకు తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికై పదవీ ప్రమాణం చేసిన వద్దిరాజు రవిచంద్రను పలువురు యాదవ ప్రముఖులు శాలువాలతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



# ఆరోగ్య ఉప కేంద్రంలో ఏఎన్ఎంల విధులు వారంలో రెండు రోజులైనా ?

గుండాల, ఏప్రిల్ 25(జనం సాక్షి) యాదాద్రి జిల్లా గుండాల మండలంలో ప్రజల ఆరోగ్య సంక్షేమర్థం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకరు మెడికల్ ఆఫీసర్ మరొకరు యునాని డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. కాగా మండలంలో 8 ఉప కేంద్రాలలో సెకండరీ ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తూ ఉంటారు. ఎనిమిది ఉపకేంద్రాలలో ఏఎన్ఎంలు గ్రామాలలో బాలింతలు చిన్నపిల్లలు ప్రజల ఆరోగ్య రీత్యా సేవాలందించవలసి ఉంది. కానీ ఏఎన్ఎంలలో కొందరు వారంలో బుధవారం, శనివారం మాత్రమే ఉపకేంద్రాలకు వెళ్లి రిజిస్టర్లో సంతకాలు చేసి ఆయా గ్రామాలలో ఆశా వర్కర్లు సేకరించిన బాలింతల, ప్రెగ్నెన్సీ, చిన్నపిల్లల ,తదితర విషయాల రికార్డులను తీసుకొని చిన్న పిల్లలకు వయసును బట్టి ఇంజక్షన్లు ఇచ్చి మధ్యాహ్నం ఒక గంట తర్వాత ఉప కేంద్రానికి తాళం వేసి వెళ్ళిపోతున్నారని, గ్రామాలలో ప్రజలు తెలుపుతున్నారు. మండలంలోని మాసాన్ పల్లి గ్రామంలోగల ఆరోగ్య ఉప కేంద్రం, గురువారం తాళం వేసి ఉండడం, ప్రజల తెలుపుతున్న విషయాలు నిజమే అని ఊతమిస్తున్నాయి. ఇదే విషయంపై గుండాల పీహెచ్ సి మెడికల్ ఆఫీసర్ ను వివరణ కోరగా మండలంలో ఆరోగ్య ఉప కేంద్రాలకు ఏఎన్ఎంలు వారంలో రెండు రోజులే విధులకు హాజరవుతుండడం పై,నాదృష్టికి ఎలాంటి సమాచారం అందలేదని , వారం మొత్తం విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

## ఓటర్ స్లిప్పులు ప్రజలకు పంపిణీ చేసిన

# ఆర్డీవో రాజేంద్ర గౌడ్



కల్లూరు ఏప్రిల్ 25(జనం సాక్షి) తెలంగాణ రాష్ట్రంలో మే 13 వ తారీఖున జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కల్లూరు మండలంలో ఓటు హక్కు కలిగిన ప్రజలకు ఓటర్ స్లిప్పుల ను ఎన్నికల నిర్వహణ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి,ఆర్డీవో రాజేంద్ర గౌడ్ స్థానిక తాసిల్దార్ పులి సాంబశివుడితో కలిసి పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురువారం కల్లూరు మండల పరిధిలోనిహ నుమా తండా ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన 1 14వ పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాల ఏర్పాట్లను అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి మరమ్మతు పనులను మండల స్థాయి అధికారులతో కలిసి పరిశీలించారు. పోలింగ్ సందర్భంగా ప్రజలుఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలన్నారు .సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.. నియోజకవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2 లక్షల,43, వేల పైగా ఉన్న ఓటర్లు లందరికీ గురువారం నుంచి బిఎల్ఓ ల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఓటరు స్లిప్పులు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈనెల 30వ తారీకు వరకు ఓటర్ల స్లిప్పుల పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేంద్రగౌడ్ తో పాటు తాసిల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## పలు చోట్ల ప్రపంచ మలేరియా దినోత్సవం..



మధిర ఆర్సి, ఏప్రిల్ 25.(జనంసాక్షి) మధిర మండల పరిధిలో పిహెచ్చి దెందుకూరు వైద్యులు డా. పృథ్వి రాజ్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరఫున పారా మెడికల్ సిబ్బంది పలుచోట్ల ప్రపంచ మలేరియా దినోత్సవ కార్యక్రమంలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా పిహెచ్చి దెందుకూరు నందు వచ్చిన పేషెంట్ లతో పాటు పిహెచ్చి వైద్య సిబ్బంది, ఖమ్మంపాడు, దెందుకూరు పారా మెడికల్ సిబ్బంది ప్రపంచ మలేరియా దినోత్సవ ప్రాముఖ్యత గురించి, ప్రధాన%శీ%గా దోమలు పుట్టకుండా, కుట్టకుండా మలేరియా జబ్బు ఏ విధంగా ఉంటుందో తెలియజేసే కరపత్రాల ద్వారా సంపూర్ణ%శీ%గా వివరించార అదేవిధంగా మధిర సివిల్ హాస్పిటల్ పరిధిలో వైద్యులు డా. ప్రేమ్ కుమార్, వైద్య సిబ్బంది, పీపీ యూనిట్, పారా మెడికల్ సిబ్బంది, మధిర టీబీ యూనిట్ వైద్య సిబ్బంది సంయుక్త%శీ%గా వచ్చిన ప్రజలకు మలేరియా వ్యాధి ప్రాముఖ్యత గురించి వివరించారు.మధిర టౌన్ మడుపల్లి మహదేవపురం బస్తీ దవఖాన, పల్లె దవఖాన వైద్య బృందం పారా మెడికల్ సిబ్బంది ద్వారా మధిర మండలం మలేరియా నివారణ సిబ్బంది పాల్గొని ప్రజలకు సంపూర్ణ%శీ%గా అవగాహన పరచినారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ, పట్టణ ప్రాంత ఆరోగ్య సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, ఐసిడిఎస్, ఐకేపీ, జిపి సిబ్బంది పాల్గొన్నారు.



## జెఈఈ మెయిన్స్ లో మెరిసిన జయ విద్యార్థులు

సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి): జెఈఈ మెయిన్స్-2024 ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబరిచి అన్ని కేటగిరిలో కలిపి జాతీయస్థాయిలో 10వేల లోపు ర్యాంకులు 16 మంది విద్యార్థులు సాధించారని జిల్లా కేంద్రంలోని జయ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.వీరిలో కందిబండ వెంకటేష్ 528, గుజ్జా చందన 954, బి.హర్షిత 1183, ఎం.హర్షిని 4031, కె.సిద్ధార్థన్ 4098, జి.సింధు 4451, జి.గోపి 4830, కె.సాయి శివరంజన్ 5921, జి.అక్షయ 6433,గౌతమ్ కుమార్ 7651, కౌశిక్ 7846, అభిజీత్ 8399, ఎస్.నివేదిత 8985, ఓ.విష్ణు తేజ 9099, ఎస్.దీక్షిత 9338, డి.సోమేశ్వర్ 9755 ర్యాంకును సాధించినట్లు తెలిపారు.మొత్తం 48 మంది విద్యార్థులు అడ్వాన్స్ కు అర్హత సాధించారని తెలిపారు .కళాశాలలో జరిగే అత్యుత్తమ ప్రోగ్రామ్ ద్వారా ఈ ర్యాంకులు సాధించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ, లెక్చరర్లు ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.



# జెఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్లోక విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):
గురువారం వెలువడిన జాతీయస్థాయి జేఈఈ మెయిన్స్ - 2024 ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని శ్లోక ఐఐటి అండ్ మెడికల్ అకాడమీకి చెందిన విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ ను సాధించినట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ మారం వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జెఈఈ మెయిన్స్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరంలో 31 మంది విద్యార్థులు జెఈఈ మెయిన్స్ కు హాజరైనట్లు తెలిపారు. పి.శంకర్ 99.38 పర్సంటైల్, బి.శివాని 99.03, ఎం.వరుణ్ 95.72, ఎం.యాక్షేంద్ర 94.40, సిహెచ్.వేణుగోపాల్ 90.06 పర్సంటైల్ సాధించారని తెలిపారు. వీరితో పాటు మరో పది మంది విద్యార్థులు అడ్వాన్స్ కు అర్హత సాధించినట్లు చెప్పారు. వ్యక్తిగత పర్యవేక్షణ, ఒత్తిడి లేని విద్యా విధానంతో పాటు ప్రణాళిక బద్ధమైన బోధనతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని అన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా విద్యనందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఫలితాలే అందుకు నిదర్శనమన్నారు. ఇంతటి ఘన విజయానికి కృషిచేసిన విద్యార్థులు, అధ్యాపకులకు సహకరించిన పేరెంట్స్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన సాధారణ పరిశీలకులు రివ్యూ

**నల్గొండటౌన్, ఏప్రిల్ 25 (జనంసాక్షి):** లోక సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన సాధారణ పరిశీలకులు మనోజ్ కుమార్ మాణిక్రావు సూర్యవంశీ, పోలీసు పరిశీలకులు అమోఘ్ జీవన్ గాంకర్, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, జిల్లా ఎస్పి చందనా దీప్తి జిల్లా కలెక్టర్ చాంబర్లో పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికలు శాంతి యుతంగా ప్రశాంత వాతావరణంలో ప్రజలు తమ ఓటు వినియోగించు





టకు, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తీసుకుంటున్న భద్రతా చర్యలు, ఓటర్లను ప్రలోభ పెట్టే డబ్బు మద్యం, నగదు కట్టడి తదితర అంశాల పై చర్చించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, యస్.బి డిఎస్పీ రమేష్, నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి, మిర్యాలగూడ డిఎస్పీ రాజశేఖర రాజు, దేవరకొండ డిఎస్పీ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు శుభాశీస్సులు

దేవరకొండ జనం సాక్షి ఏప్రిల్ 25 దేవరకొండ నియోజకవర్గం వ్యాప్తంగా ఈరోజు వివిధ



గ్రామాలలో జరిగిన వివాహ వేడుకలకు తల్లిదండ్రుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిలుగా దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహా, యంపీపి జాని యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్త్య దేవేందర్ నాయక్ లు హాజరై నూతన వధూవరులకు శుభాశీస్సులు అందించారు. ఈ శుభ సందర్భంలో వారితో పాటు స్థానిక నాయకులు పంగ యాదయ్య, బోడ యాదయ్య మాజీ సర్పంచ్, పంగ మల్లయ్య బొద్దుపల్లి సైదులు మాజీ ఎంపీటీసీ, రాకేష్ మాజీ సర్పంచ్, ఇడ్లావత్ శంకర్ మాజీ ఎంపిటిసి, ఆదిరాల రాము మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు చింతకుంట్ల రాకేష్, రాజు, తరుణ్, అనీల్ తదితరులు ఉన్నారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



నేరేడుచర్ల (జనంసాక్షి):
గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళా మృతి చెందిన సంఘటన నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో చోటుచేసుకుంది. నేరేడుచర్ల ఎస్సై రవీంద్ర నాయక్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని హుజూర్నగర్ రోడ్ లో గురువారం తెల్లవారుజామున 3.30 గంటలకు గుర్తుతెలియని వాహనం ఢీకొని పెంచికల్ దిన్న గ్రామానికి చెందిన బొల్లెద్దు జానకమ్మ( 50)మృతి చెందారు. ఆమె కుమారుడు సంపత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## దేవరకొండలో గుట్టల మధ్య ..
# 32 క్వింటాళ్ల అక్రమ పిడిఎస్ బియ్యం పట్టివేత

దేవరకొండ జనం సాక్షి ఏప్రిల్ 25
దేవరకొండ పట్టణ జంగాల కాలనీలోని ఖాళీ స్థలంలో గుట్టల మధ్య అక్రమంగా డంపు చేసిన70 బస్తాల 32 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు దేవరకొండ డిటిసిఎస్ హన్మంతు శ్రీనివాస్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 32 క్వింటల పిడిఎస్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలానికి చేరినట్లు తెలిపారు. జంగాల కాలనీలోని బొంతలు కొట్టేవాళ్ళు గ్రామ గ్రామ తిరిగి బొంతలు కొడితే కొందరు బియ్యం ఇచ్చారని అధికారులతో వారు తెలిపారు. ఈ సందర్భంగా డిటిసిఎస్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఏది ఏమైనా ఈ బియ్యాన్ని కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎన్నో డబ్బులు వెచ్చించి నిరుపేదలకు సబ్సిడీలో ఇస్తుందని , కాబట్టి ఇలా డంపు చేసి అమ్మటం చట్ట విరుద్ధమని, బొంతలు కొట్టినచో మీరు డబ్బులు మాత్రమే తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో బియ్యం తీసుకోకూడదని అన్నారు. ఒక వేళ తీసుకున్న అట్టి బియ్యాన్ని వండుకోని తినాలే తప్ప అమ్ముకోకూడదని కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగింది. ఇట్టి 32 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేసి సేఫ్ కస్టడీ కొరకు గోదాంలో భద్రపరచి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

**పోలీస్,రెవెన్యూ,పౌరసరఫరాల శాఖలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్న అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు ఎందుకు అని పట్టణ ప్రజలు కోరుతున్నారు.**





## ఓ అనాధ తల్లిని వృద్ధాశ్రమానికి చేర్చిన
# దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్



**అనాధ తల్లి కన్నీళ్లు తుడిచిన స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు**

**ఎన్నో జయ ప్రయోసాలకు ఓర్చి అనాధలకు ఆశ్రమం నిర్వహించడం అభినందనియం :ఎన్ వీ టీ**

**సామాజిక స్పృహ కలిగిన ప్రతి ఒక్కరూ తమ తమ జన్మదిన వేడుకలను, వివాహ వేడుకలను వృద్ధాశ్రమంలో జరుపుకోవాలి: మాదిరెడ్డి సంధ్యారెడ్డి మహాలక్ష్మి మహిళా మండలి వృద్ధాశ్రమం అధ్యక్షురాలు**

దేవరకొండ, ఏప్రిల్ 25 జనంసాక్షి :
మండుటెండలో ఒంటరిగా దిక్కుతోచని స్థితిలో ఉన్న ఓ తల్లిని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ వారు మహాలక్ష్మి మహిళా మండలి వృద్ధాశ్రమంలో చేర్చిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. హనుమాన్ నగర్ లో ఒక అరుగు మీద కూర్చొని బాధపడుతున్న అనాధ తల్లిని గమనించిన దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ వారు ఆమె వద్దకు వెళ్లి వివరాలడగా ఏమి చెప్పలేని పరిస్థితిలో ఉన్న ఆమెను వెంటనే ఆటోలో ఎక్కించుకొని వృద్ధాశ్రమం అధ్యక్షురాలు



మాదిరెడ్డి సంధ్యా రెడ్డి సమక్షంలో చేర్పించడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎన్ వి టి మాట్లాడుతూ నవ మాసాలు మోసి, పెంచిన కన్నతల్లులని ఇలా వదిలేయడం అన్నది మాతృ ద్రోహం అని, చిన్నప్పుడు మనం ఎంత అల్లరి చేసినా, ఎన్ని తప్పులు చేసినా, కడుపులో దాచుకొని విసుకు చెందకుండా పెంచి, పెద్ద చేసిన వారిని రెక్కలు వచ్చిన తర్వాత వదిలేయడం అమానుషమని అన్నారు . మన కన్న తల్లిదండ్రులు 60 ఏళ్లు దాటిన తర్వాత చిన్నపిల్లల గా ప్రవర్తిస్తారని, వారి ఆలనా పాలన చూసే బాధ్యత కుమారులుకుంటుందని, అలాంటప్పుడు ఎందుకు విసుక్కోవాలని అన్నారు. ఈ తల్లికి సంబంధించిన వారు ఆశ్రమం కి వచ్చి తీసుకెళ్లవలసిందిగా జనం సాక్షి ద్వారా ప్రజానీకానికి తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాలక్ష్మి మహిళ వృద్ధాశ్రమం అధ్యక్షురాలు మాదిరెడ్డి సంధ్యారెడ్డి , ఎస్బిఐ శ్రీనయ్య, కరాట మాస్టర్ శ్రీను, ఆకాష్, డాన్స్ మాస్టర్ జగన్, చక్రపాణి, నరసింహ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

**మాదిరెడ్డి సంధ్యారెడ్డి మహాలక్ష్మి మహిళా మండలి అధ్యక్షురాలు**

సమాజంలోని అనాధలకు అంగవైకల్యం ఉన్నవారికి మనమంతా అండగా నిలిచి మనోధైర్యాన్ని కల్పించాలని అన్నారు. సామాజిక స్పృహ కలిగిన ప్రతి ఒక్కరూ తమ తమ జన్మదిన వేడుకలను వివాహ వేడుకలను వృద్ధాశ్రమంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

## హైదరాబాద్ ఐపీఎల్ టికెట్స్ అమ్మకాలలో భారీ అక్రమాలకు పాల్పడుతున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పాలడుగు శ్రీనివాస్ ఓయూ లీడర్

నల్గొండ, ఏప్రిల్ 25(జనంసాక్షి)



ఐపీఎల్ టికెట్స్ బ్లాక్ మార్కెట్ లో భారీగా అమ్ముకుంటూ యావత్ తెలంగాణ క్రికెట్ అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేస్తున్న హెచ్సీఏ అక్రమ నిర్లక్ష్య వైఖరిపై ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలి. హెచ్సీఏ ని పారదర్శకంగా పైరవీలు లేకుండా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేస్తున్నాము.అదే విదంగా తెలంగాణ లో పాఠశాల నుండి హైయర్ ఎడ్యుకేషన్ వరకు స్పోర్ట్స్ లో గత పది సంవత్సరాలుగా జరుగుతున్న అవినీతి అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలి.తెలంగాణలో అన్ని గేమ్స్ లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై మరియు వాటికి సంబంధించిన కొన్ని అసోసియేషన్ లపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి స్పోర్ట్స్ అందరికీ అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం అభివృద్ధి దిశగా చర్యలు తీసుకోవాలి.



## నేడు సూర్యాపేట పుష్పగిరి స్వామి వారి రాక

సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):
జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషి మాత దేవాలయంకు నేడు పుష్పగిరి పీఠాధిపతి శ్రీ జగద్గురు విద్యా శంకర భారతి మహాస్వామి విచ్చేయనున్నట్లు సంతోషిమాత దేవాలయం అధ్యక్ష కార్యదర్శులు నూక వెంకటేశం గుప్తా, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్ తెలిపారు.గురువారం దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే ఎక్కడ లేని విధంగా పరమశివుని పుత్రిక మానసా దేవి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి స్వామి వారి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు తెలిపారు. సంతోషి మాత,లక్ష్మీ గణపతి, సత్య సాంబశివ శివస్వామి, క్షేత్రపాలక ఆంజనేయస్వామి, నవగ్రహములు, సంతాన నాగదేవత విగ్రహం గతంలో ప్రతిష్టించుకోవడం జరిగిందని, ఇప్పుడు నూతనంగా మానస దేవి అమ్మవారు దేవాలయంలో కొలువై ఉండనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి,మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,మున్సిపల్ చైర్ పర్సన్ అన్నపూర్ణ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, ఏఐసీసీ నాయకులు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డితో పాటు పలువురు పురప్రముఖులు పాల్గొననున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు బెలీదే అశోక్, సోమ శ్రీశైలం, తాళ్ళపల్లి రామయ్య, దేవరశెట్టి సోమయ్య,గోపారపు రాజు, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, మహంకాళీ ఉపేందర్, ముదిరెడ్డీ లింగా రెడ్డి, నాగమణి, ప్రభావతి,కవిత, అశోకలక్ష్మీ, కక్కిరేణి పద్మ, సుగంధమాల, కర్నాటి సూర్యకళ,లీల,దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## నేడు డెక్కన్ లో ఉచిత వైద్య శిబిరం..

పాలకీడు (జనంసాక్షి):
మండల పరిధిలోని డెక్కన్ సిమెంట్స్ భవానిపురం లో మిర్యాలగూడ వైద్య నిపుములచే ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని ఆ సంస్థ సిజీఎం ఎస్. నాగమల్లిశ్వర్రావు ఒక ప్రకటన లో తెలిపారు.నరాల సంబంధిత వ్యాధులు,స్త్రీల ఆరోగ్య సమస్యలు,జనరల్ ఆరోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వనున్నారు.ఈ అవకాశాన్ని డెక్కన్ సిమెంట్స్ సమీప గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

# గుత్తా సుఖేందర్ రెడ్డిని విమర్శించే స్థాయి అర్హత నీకు లేదు గాదరి కిషోర్



నల్గొండటౌన్, ఏప్రిల్ 25(జనంసాక్షి)
నల్గొండలోని క్యాంపు కార్యాలయంలో గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అనుచరులు మీడియా సమావేశం నిర్వహించారు .తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ పైన సంచలన ఆరోపణలు చేశారు . జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ ఇరిగి పెద్దులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ పైన మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం, పరిజ్ఞానం కలిగిన గుత్తా సుఖేందర్ రెడ్డి గారిని విమర్శించే స్థాయి గాని, వయస్సు గాని లేని చిల్లర వ్యక్తి గాదరి కిషోర్ అని అన్నారు. ఒక ఉపాధ్యాయుని కొడుకై ఉండి కనీసం వయసులో తన తండ్రి కన్నా పెద్దవాడిని గౌరవించే కనీస సంస్కారం లేని నీచుడు కిశోర్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటిలో వేలాది మంది చేసిన ఉద్యమాలను ఆయనే చేసినట్లు తన ఖాతాలో వేసుకొని, తన వెంట నడిచిన స్నేహితులను సైతం నిలువునా ముంచింది ఎవరికి తెలియదా ?ఉద్యమ కారుడినని, ఆ కోటాలో ఏమ్మెల్యే టికెట్ తెచ్చుకొని, ఏమ్మెల్యేగా గెలిచి నీ తుంగతుర్తి ప్రాంతానికి నువ్వు చేసింది ఏమి లేదు . ప్రజలకు ని చరిత్ర అంత తెలుసు కాబట్టే మొన్నటి ఎన్నికల్లో ఘోరంగా ఓడించి ,తరిమికొట్టారన్నారు కేవలం ఇసుక దందానీ వృత్తిగా మార్చుకొని వందల కోట్లు సంపాదించిన ప్రబుద్ధిడన్నారు. తెలంగాణ ఉద్యమ సమయము లో, ఉధ్యమం పేరు చెప్పుకొని రాజకీయ నాయకుల ఇండ్ల చుట్టూ తిరిగి చందాలు వసూలు చేసి ని సొంతానికి వాడుకున్నా చిల్లరగాడని అన్నారు. అలాగే కనగల్ జడ్పిటిసీ చిట్ల వెంకటేశం , బి ఆర్ యస్ పార్టీ సీనియర్ నేతలు ఐతగోని స్వామి గౌడ్ , అనీష్ , మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్టీ పతనానికి ప్రదాన కారుకుడివే కిషోర్ నని, అధికారులను వేధించి వసూళ్ళు చేసిండని ఆరోపించారు. మహిళ లోకల్ బాడీస్ లోని మహిళా ప్రజా ప్రతినిధులను మరియు మహిళా కార్యకర్తలపై నీ అసభ్యకర ప్రవర్తన మరియు వేధింపులు వాస్తవము కాదా ? అదేవిధంగా పార్టీల్లో పలు పదవులను అమ్ముకున్న ఘనత గాదర్ కిషోర్ కే వర్తిస్తుందన్నారు .తుంగతుర్తి నియోజకవర్గంలో, తిరుమలగిరి మండలం దళిత బంధు పథకంలో తన బినామీలకు మరియు అనుచరులకు ఇప్పించి కోట్ల అవినీతికి పాల్పడిన విషయం వాస్తవము కాదా. తుంగతుర్తి నియోజకవర్గంలో కోకొల్లలుగా మాట్లాడుకుం టున్నారని , దళిత బిడ్డ అని చెప్పుకునే నీవు నీ సామాజిక వర్గంలో ఉన్నవారిని కూడా ఎదగనీయకుండా వారిని భయభ్రాంతులకు గురి చేస్తూ అక్రమ కేసులని బనాయిస్తూ వ్యవహరించిన వ్యక్తి కిషోర్ అన్నారు. మీకు అనుకూలమైన కలెక్టర్ ను రంగారెడ్డి జిల్లా లో పెట్టుకొని కుంట్లూరు గ్రామా శివారులో లో భూ అక్రమ దందా చేసిన విషయం ఆంధ్రజ్యోతి పత్రిక లో ప్రచురించిన విషయం వాస్తవము కాదా ? అక్రమ భూముల కొనుగోలులో కుటుంబ సభ్యులను విడదీసి వారి మరణాలకు కారణమై అట్టి పాపాన్ని మూట కట్టుకున్న విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. ఐకెపి సెంటర్లను ఏర్పాటు చేసి ,వాటి ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ని బినామిలా రైస్ మిల్లులకు పంపింది నిజం కాదా?దొంగ నోట్ల కేసులు, ఇసుకదందాలు, భూ కబ్జాలు, బ్లాక్ మెయిల్ చేసి అడ్డగోలుగా సంపాదించిన పెద్ద లుచ్చ అని తిట్టారు .నీస్థాయి మరిచి చిన్నా, పెద్దా తేడా లేకుండా మాట్లాడితే ప్రజలు తరిమి కొడతారు జాగ్రత్తనని ,రాష్ట్ర వ్యాప్తంగా రైస్ మిల్లుల యజమానులను బెదిరించి ,పిడియస్ బియ్యం అమ్ముకుని కోట్లకు కోట్లు సంపాదించడని ఒక సామాన్య ,సాధారణ వ్యక్తి చేతిలో తుక్కు తుక్కుగా ఓడిపోయిన ఆయనకు సిగ్గు రాలేదని , మరోసారి గుత్తా సుఖేందర్ లాంటి వ్యక్తి మీద ఒక్కమాట మాట్లాడిన నాలుక కోసే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.గాదరి కిషోర్ అవినీతి చిట్టా , చేసిన దందాలు వివరాలు, బాగోతం మొత్తం బయటపెడుతామని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు,కనగల్ జడ్పిటిసీ చిట్ల వెంకటేశం ,బి ఆర్ యస్ సీనియర్ నేతలు , ఐతగోని స్వామి గౌడ్ ,వెంకటేశ్వర్ రావ్, గోపాల్ రెడ్డి, యామ దయాకర్, హరికృష్ణ,మునాసు వెంకన్న మాజీ జడ్పీటీసీ సజీవ, చిల్కరాజు శ్రీనివాస్, బకారం వెంకన్న, పిఏ సిఎస్ చైర్మన్ దోటి శ్రీనివాస్, చెన్నగోని యాదగిరి, మైనారిటీ బి ఆర్ ఎస్ లీడర్స్ అనీష్ ముక్తాదర్, హన్ను తదితరులు పాల్గొన్నారు.



### తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన ఎక్సైజ్ ఎస్ ఐ సీతారామరాజు..

బూర్గంపహాడ్ ఏప్రిల్ 25 (జనంసాక్షి):
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలంలో గతంలో నాటుసారా అమ్మేవారిని తయారీచేసిన వారిని ఎక్సైజ్ సీఐ రహీమున్నీసాబేగం ఆదేశాల తో ఎస్సై అల్లూరి సీతారామరాజు గురువారం తహశీల్దార్ ముజాహిద్ ఎదుట బైండోవర్ చేశారు. మండలానికి చెందిన 10 మంది నాటుసారా తయారీ, విక్రయాల్లో ఉండటంతో అనుమానాస్పదంగా ఉన్న వారిలో 110 సీఆర్పీసీ కింద 9 మంది, 109 సీఆర్పీసీ కింద ఒకరిని బైండోవర్ చేయడం చేశారు. వీరంతా ఇప్పటి నుండి నాటుసారా అమ్మినా, తయారీ చేసినా రూ. లక్ష జరిమానాతో పాటు ఏడాది జైలు శిక్ష పడుతుందని అధికారులు వారిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్కానిస్టేబుల్ హలీమ్, కానిస్టేబుల్ వీరబాబు, డ్రైవర్ వెంకట్ పాల్గొన్నారు.

## ఈదమ్మ గుడి నిర్మాణానికి విరాళం

చిట్యాల ఏప్రిల్ 25(జనం సాక్షి):



చిట్యాల మండలంలోని చిన్నకాపర్తి గ్రామంలో వడ్డెరుల కులదైవం ఈదమ్మ తల్లి గుడి నిర్మాణానికి ఆ గ్రామానికి చెందిన ఇమడపాక (బైండ్ల) భిక్షపతి- సత్తమ్మ జ్ఞాపకార్థం వారి కూతురు చెన్నపాక పద్మ అల్లుడు చెన్నపాక శ్రీనివాస్ గురువారం రూ. 51 వేలు విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వరికుప్పల వెంకన్న, శిరస్సు రాములు, శిరస్సు ఇద్దయ్య, శిరస్సు హనుమయ్య, శిరస్సు అంజయ్య, వరికుప్పల ఎల్లయ్య, వరికుప్పల బుచ్చయ్య, బోదాసు శ్రీను, పల్లపు ప్రశాంత్, ఇరగదిండ్ల రాజు, నగేష్, మల్లేష్, మారయ్య, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీలలో వార్షికోత్సవాలు

వలిగొండ జనం సాక్షి ఏప్రిల్ 25
మండల పరిధిలోని రెడ్ల రేపాక గ్రామంలో అంగన్వాడి టీచర్స్ ఎలిమినేటి వసంత దుబ్బ ప్రేమలత అంగన్వాడి సెంటర్లలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పిల్లల కొరకు ఏర్పాటు చేసిన పలు రకాల బొమ్మల ప్రదర్శన ఆటా వస్తువులు చూపిస్తూ పిల్లలు నిత్యము స్కూలుకు అలవాటు పడే విధంగా వారు భాగస్వాములు కావాలని ఈ వార్షికోత్సవం ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల తల్లులు మేముమాసొంతం పనులకు పోయిన కూడా వారు తల్లులుగా పిల్లలకు సేవలు అందిస్తున్నారని వారు అన్నారు ఈ వార్షికోత్సవంలో పాలుపంచుకొనిటీచర్స్ కు ఆయాలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడిల విద్యార్థులు తల్లులు తదితరులు పాల్గొన్నారు.



# ఓటర్ స్లిప్పులు పంపిణీ చేస్తున్న బిఎల్ఓలకు సహకరించాలి

**ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి -జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు**



సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి): పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. గురువారం కలెక్టరేట్ లో లోక్ సభ ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఎస్పీ రాహుల్ హేగ్డే, జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్.ప్రియాంకతో కలసి వివిధ రాజకీయ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ బిఎల్ఓలు ఓటర్ స్లిప్పులను ప్రతి ఇంటికి పంపిణీ చేస్తున్నారని, ఈనెల 28 వరకు స్లిప్పులు పంపిణీ చేస్తారని, దీనికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని అన్నారు. 85 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులకు ఇంటి నుండి ఓటు హక్కు వినియోగించడానికి అవకాశం ఉందని, ఇంటి వద్ద నుంచి తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందని హెూం ఓటింగ్ కోసం 12డి ఫామ్స్ 6070 మందికి ఇవ్వడం జరింగిదని, ఇప్పటివరకు 354 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. హెూమ్ ఓటింగ్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి ముందస్తు సమాచారం అందిస్తామని, ఏజెంట్లు పీవోలు సమక్షంలో భద్రత మధ్య ఓటు హక్కు వినియోగానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హెూమ్ ఓటింగ్ చేసుకున్న వారి వివరాలను కూడా ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులకు తెలపాలని సూచించారు. పిడబ్ల్యుడి ఓటర్స్ ఇప్పటి వరకు 344 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పిడబ్ల్యుడి ఓటర్స్ పోలింగ్ రోజు సౌకర్యాల కొరకు ముందుగా సాక్ష్యం యాప్ నందు నమోదు చేసుకోవాలని సూచించారు.నాలుగు నియోజకవర్గాలలో ఈవీఎం స్టాంగ్ రూమ్స్ ను రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించవచ్చని పేర్కొన్నారు.ఎస్పీ రాహుల్ హేగ్డే మాట్లాడుతూ క్రిటికల్ పోలింగ్ స్టేషన్ లలో పోలింగ్ కేంద్రాల లోపల, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ 100శాతం జరిగేందుకు కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.నాలుగు నియోజకవర్గాలలో సంబంధించిన ఈవీఎం స్ట్రాంగ్ రూములలో కూడా గట్టి పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అన్ని చెక్ పోస్టులలో గట్టి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ఇప్పటి వరకు 5 కోట్ల 68 లక్షల సీజింగ్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమాలకు లోబడి వ్యవహరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వివి. అప్పారావు, ఎన్నికల పర్యవేక్షకులు శ్రీనివాసరాజు, వివిధ పార్టీల ప్రతినిధులు చకిలం రాజేశ్వరరావు, సవరాల సత్యనారాయణ, కోట గోపి,ఎండీ.ఆబిద్, స్టాలిన్, కలెక్టరేట్ ఏవో సుదర్శన్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సంకల్ప మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం...

**అనంతగిరి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తాం హాస్పటల్ డైరెక్టర్ వర్మ...**




కోదాడ, జనం సాక్షి: అనంతగిరి మండలం వాయిల సింగారం గ్రామంలో సంకల్ప హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుండి వచ్చిన మహిళలకు హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ అపూర్వ వివిధ రకాల పరీక్షలు నిర్వహించి మహిళలకు ఉచిత టెస్టులు చేసి, ఉచిత మందులు అందించారు.ఈ సందర్భంగా డాక్టర్ అపూర్వ మాట్లాడుతూ ....గర్భిణీ స్త్రీలకు వివిధ సూచనలు చేశారు . సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని ,గర్భిణీ స్త్రీలు సంతులిత పౌష్టిక ఆహారం తీసుకోవాలని ఇది పెరిగే పిండానికి దోహదపడుతుందని విటమిన్లు, ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని తెలియజేశారు. సంతులిత పౌష్టిక ఆహారం తీసుకొని రోగ నిరోధక శక్తిని కలిగి ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ వర్మ , మేనేజర్ శేఖర్, హాస్పిటల్ సిబ్బంది మధు ,సందీప్,గౌస్, జరీనా, మాధవి ,త్రివేణి,ద్వారక ,గ్రామ సభ్యులు నరేందర్,నవీన్, భరత్,వెంకటేష్,కొండలు పాల్గొన్నారు....

# భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి జహంగీర్ కు ఐద్వా సంపూర్ణ మద్దతు :పాలడుగు ప్రభావతి



చిట్యాల ఏప్రిల్ 25(జనం సాక్షి): భువనగిరి పార్లమెంటు అభ్యర్థి మహమ్మద్ జహంగీర్ కు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మద్దతు తెలియజేసినట్లు ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి తెలిపారు. ఈరోజు చిట్యాల మండల కేంద్రంలో ఐద్వా మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ కమ్యూనిస్టులు పేదల పక్షాన ఎర్రజెండా నాయకత్వాన అనేక ఉద్యమాలు నిర్వహించారని పోరాట ఫలితంగానే తెలంగాణలో భూముల పంపకం జరిగిందని వెట్టిచాకిరి విముక్తి అయిందని మహిళలకు రక్షణ కల్పించబడిందని అన్నారు. అలాంటి వారసత్వం కలిగిన సిపిఎం అభ్యర్థి జహంగీర్ ను గెలిపించినట్లయితే నిరంతరం ప్రజల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తాడని పార్లమెంటులో మహిళలకు అనుకూలమైన చట్టాల రూపకల్పనకు కృషి చేస్తారని అన్నారు. మహిళలపై మోడీ ప్రభుత్వ హాయంలో నిరంతరం దాడులు జరుగుతున్నాయని అత్యాచారాలు హత్యలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయడంలో మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని అన్నారు. సిపిఎం అభ్యర్థికి అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, జిల్లా కమిటీ సభ్యురాలు కృష్ణవేణి ,అండాలు, ధనమ్మ, వీరమల్ల కేదార్ ,అమ్మ బండారు విజయలక్ష్మి, జానకమ్మ,నాగమణి, వరలక్ష్మి, ఎన్ చంద్రకళ, హేమలత, ఎల్లమ్మ ,అలివేలు, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలి -సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక



సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):మనిషిని సర్వోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య అని,ఆ విద్యకు ప్రభుత్వాలు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్,న్యాయవాది ఎల్.భద్రయ్య అన్నారు.జిల్లా కేంద్రంలోని డిటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన వేదిక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ విద్యకు బడ్జెట్ కేటాయింపులు పెంచాల్సింది పోయి ప్రభుత్వాలు రోజురోజుకు తగ్గిస్తున్నాయని అన్నారు.ప్రతి అవాసంలో పిల్లల సంఖ్యతో నిమిత్తం లేకుండా బడి ఉండాలన్నారు.ఆ బడిలో తరగతికి ఒక గది,తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని అన్నారు. ప్రతి సంవత్సరం వేసవిలోనే బదిలీలు, ప్రమోషన్లు, నియామకాలు ఒక క్యాలెండర్ ప్రకారం నిర్వహించాలని కోరారు.అకడమిక్ ఇయర్ మధ్యలో ఏర్పడిన ఖాళీలను పది రోజుల్లోనే అదే గ్రామంలో అర్హులైన యువతతో తాత్కాలికంగా నింపుకునే అధికారం సంబంధిత హేడ్మాస్టర్ కు ఇవ్వాలని పేర్కొన్నారు.అటెండర్, సర్వీస్ పర్సన్ లను నియమించాలని, ప్రతి పాఠశాలలో త్రాగునీరు, ప్రహరీ గోడలు, టాయిలెట్స్, విద్యుత్ తదితర అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో సామాజిక అధ్యయన వేదిక కో.కన్వీనర్ రేపాక లింగయ్య, సీనియర్ న్యాయవాదులు తల్లమల్ల హసేన్, ఏడిండ్ల అశోక్, సామాజిక ఉద్యమకారులు సిహెచ్.రమణాచారి, దంతాల రాంబాబు,కరీం,చామకూరి నర్సయ్య, నారబోయిన వెంకట్ యాదవ్, జి.ఆనంద్ భాస్కర్,కె.యోగానంద్, టి.ప్రభాకర్,సిహెచ్.వెంకటయ్య, పి.దేవేందర్,బొల్లెద్దు వెంకన్న,పేర్ల నాగయ్య,ఎన్.పరమేష్, పి.బిక్షం, ఎన్.వెంకన్న, తగుళ్ల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# ఈత సరదా ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది

## ఇలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని రిజర్వాయర్ కాంట్రాక్టర్ వేసవికాలం సెలవులతో విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదం

## అంతంపేట గ్రామంలో విషాదఛాయలు

మర్రిగూడ, ఏప్రిల్ 25, జనం సాక్షి: శివన్నగూడ రిజర్వాయర్ లో ఈతకు వెళ్లి విద్యార్థి మృతి చెందిన ఘటన మర్రిగూడ మండలం శివన్నగూడ రిజర్వాయర్ లో జరిగినది, పూర్తి వివరాలకు వెళితే గట్టుప్పల్ మండలం అంతంపేట గ్రామానికి చెందిన మహమ్మద్ హుస్సేన్ , అస్మత్ లకు ఇద్దరు కుమారులు పెద్ద కుమారుడు మహమ్మద్ ఖలీల(14) నల్లగొండలో ప్రభుత్వ మైనార్టీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు, స్కూల్లకు వేసవి సెలవులు ప్రకటించడంతో మంగళవారం సొంత గ్రామమైన అంతంపేట గ్రామానికి వచ్చాడు, ఈ క్రమంలో బుధవారం సాయంత్రం శివన్నగూడ రిజర్వాయర్లు ఈత నేర్చుకునేందుకు సమీప బంధువు చాంద్ పాషా, స్నేహితుడు చరణ్ వెళ్లాడు, ఈత నేర్చుకునే క్రమంలో నీటి లోపలికి వెళ్లిన చరణ్, ఖలీల్ మునిగిపోతుండగా చాంద్ ఇద్దరిని రక్షించే క్రమంలో ముందు చరణ్ ని రక్షించగా అప్పటికే ఖలీల్ నీటిలో మునిగిపోయాడు, ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోవడంతో ఎక్కడ ఉన్న వారి సహాయంతో మర్రిగూడ ఎస్ఐ రంగారెడ్డి గారికి సమాచారం అందించగా వెంటనే స్పందించి



సంఘటన స్థలానికి చేరుకుని 20 మంది గజ ఈతగాండ్లతోని గాలింపు చర్యలు చేపట్టారు, రాత్రి కావడంతో చర్యలు గురువారం ఉదయం ప్రారంభించగా ఖలీల్ మృతదేహం లభ్యమైనది, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని విచారణ జరుగుతున్నట్లు మర్రిగూడ ఎస్ఐ రంగారెడ్డి తెలియజేశారు,